ప్రజాశక్తి
గురువారం 12 డిసెంబర్ 2024 | 5 | అనంతపురం

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎ మ్మెల్సీ డా॥గేయానంద్

సాగునీటి సంఘాలకు నగారా

- వెలువడిన నోటిఫికేషన్
- ఈనెల 14న సాగునీటి సంఘాలకు ....
- 17న డిస్ట్రిబ్యూటరీలకు ఎన్నికలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు బుధవారం నాడు ఎన్నికల నోటిఫికేషన్‌ను అనంతపురం కలెక్టర్ వినోద్ కుమార్ విడుదల చేశారు. ఈనెల 14న సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. డిస్ట్రిబ్యూటరీలకు ఈనెల 17వ తేదిన ఎన్నికలు జరుగుతాయి. ఇప్పటికే జలవనరుల శాఖ అధికారులు ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను మొదలుపెట్టారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేవారు ఇప్పటికే సన్నద్ధమై ఉన్నారు. నోటిఫికేషన్ కూడా రావడంతో రాజకీయ వాతావరణం కూడా వేడెక్కింది.

అనంతపురం జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ప్రకారం 54 మేజర్ సాగునీటి సంఘాలు, ఆరు మీడియం సాగునీటి సంఘాలు, 89 మైనర్ సాగునీటి సంఘాలున్నాయి. వీటన్నింటికీ ఈనెల 14వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఇక ఆరు డిస్ట్రిబ్యూటరీలకు ఈనెల 17వ తేదీన ఎన్నికలు జరుగుతాయి. ఈ మేరకు ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం సిద్ధమైంది. వాస్తవానికి సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగి చాలాకాలమైంది. 2015లో ఎన్నికలు జరిగాయి. 2020తో వీటికి పదవీకాలం పూర్తయ్యింది. ఆ తరువాతి నుంచి ఎన్నికల్లేవు. వైసిపి హయాంలో పూర్తిగా ఈ ఎన్నికలపై దృష్టి సారించలేదు. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఎన్నికలపై దృష్టి సారించింది. అక్టోబర్‌లోనే ఎన్నికల కసరత్తును ప్రారంభించినప్పటికీ వరదలు, ఇతర కారణాలతో వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు నోటిఫికేషన్ రావడంతో ఎన్నికలు రెండు రోజుల్లో లాంఛనం కానున్నాయి.

వైసిపి పాల్గొనేనా.?

సాగునీటి సంఘాల ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరుగుతున్నప్పటికీ సాధారణంగా ఈ ఎన్నికల్లోనూ రాజకీయపార్టీలు తమ అభ్యర్థులను బరిలో దింపుతూ ఉంటాయి. ఏ ఎన్నికలైనా రాజకీయాలతోనే ముడి పడి ఉంటాయి. 2024 ఎన్నికల్లో ఘోర ఓటమి తరువాత ఇంకా కోలుకోలేని స్థితిలో వైసిపి ఉంది. ఆ పార్టీ నాయకుల్లోనూ అంతటి ఉత్సహం లేదు. నియోజకవర్గ సమన్వయకర్తలు కూడా ఇంకా రాజకీయాల వైపు దృష్టి సారించిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలు ఏకపక్షంగానే సాగుతాయా అన్నది చూడాల్సి ఉంది. అధికార తెలుగుదేశం నాయకులు మాత్రం ఇప్పటికే సాగునీటి సంఘాలకు పోటీపడే వారు సిద్ధమై ఉన్నారు. ఎవరైతే బాగుంటుందన్న దానిపైనా ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది . సాధ్యమైనంత వరకు ఏకగ్రీవంగా ఈ ఎన్నికలు సాగే అవకాశాలే అధికంగానున్నట్టు తెలుస్తోంది. దీంతో రాజకీయంగా అంతటి హడావుడి ఎక్కడా కనిపంచడం లేదు. మొక్కుబడిగా అన్నట్టుగానే ఈ ఎన్నికలు సాగే అవకాశాలే అధికంగా కనిపిస్తున్నాయి.

ప్రత్యేక వాహనంలో జవాను పార్థివదేహాన్ని తీసుకెళ్తున్న ఆర్మీ సిబ్బంది

నార్పలకు జవాను పార్థివదేహం

- కన్నీటి పర్యంమైన కుటుంబ సభ్యులు
- నేడు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రజాశక్తి-నార్పల

విధి నిర్వహణలో భాగంగా జమ్ముకాశ్మీర్‌లో ల్యాండ్‌మైన్ పేలి మృతి చెందిన జవాను సుబ్బయ్య పార్థివదేహం అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రానికి బుధవారం చేరుకుంది. బెంగుళూరు నుంచి ప్రత్యేక వాహనంలో సైనికాధికారులు నార్పలకు సుబ్బయ్య పార్థివదేహాన్ని తీసుకుని వచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న ప్రజలు, యువకులు జాతీయ జెండాలను చేతబట్టుకుని జవాను పార్థివదేహాన్ని ఉంచిన వాహనంతో నార్పల క్రాసింగ్ నుంచి గవ్వల వీధి వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జవాన్ సుబ్బయ్య అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. దారి పొడవునా పూలు జల్లుతూ యువకులు వారి దేశభక్తిని చాటుకున్నారు. సుబ్బయ్య పార్థివదేహాన్ని చూసిన భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యవంతం అయ్యారు. కుటుంబ సభ్యులను జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, సింగనమల సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, మాజీ సైనిక అధికారులు పరామర్శించి ధైర్యం చెప్పారు. కాగా గురువారం ఉదయం గురువారం ఉదయం 9 గంటలకు సుబ్బయ్య అంత్యక్రియలను నార్పలలో నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సికిందర్‌కు నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

సికిందర్ ఆశయాలను కొనసాగిస్తాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేసే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడి హక్కుల సాధనే లక్ష్యంగా సిపిఎం కొనసాగించిన పోరాటాల్లో సికిందర్ భాగస్వామిగా పని చేశారని,, ఆ ఆశయాలను సాధించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. సిపిఎం నగర కమిటి నాయకులు సికిందర్ 5వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. సికిందర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ సికిందర్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడారని గుర్తు చేశారు. సమస్యల్లో ప్రజలకు తన వంతు సహాయం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వలి, మసూద్, ఓబులేసు, రాజు, లతీఫ్, రామాంజినేయులు, నూరుల్లా, జీవా, ఆది, సికిందర్ కుటుంబ సభ్యులు దాదు, అలీ, ఇమ్రాన్, చాంద్, వన్నూరప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల కొరత .. విధులకు ఆటంకం

ముందుకు సాగని ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యుల ఆన్‌లైన్ అప్‌లోడింగ్ - మెప్మా సిబ్బందికి తప్పని కష్టాలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నేరుగా వారికి అందేలా చూడటానికి వీలుగా చేపట్టిన స్వయం సహాయక గ్రూపు సభ్యుల ప్రొఫైలింగ్ ఆన్లైన్ విధానం మెప్మాకు అనేక కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. నగరంలో 4200 గ్రూపు సభ్యులు ఉన్నారు. వీరి వ్యక్తిగత వివరాలు ఆన్‌లైన్‌లో అప్లోడింగ్ చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇందులో భాగంగా రిసోర్స్ పర్సన్స్ చేపట్టిన తనిఖీలో వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. పట్టణ పేదరిక నిర్మూలన విభాగం మెప్మాలో కమ్యూనిటీ ఆర్గనైజర్ పరిధిలోని గ్రూపు సభ్యుల వివరాలను పరిశీలించి దరఖాస్తులపై సంతకం చేసిన అనంతరం కమ్యూనిటీ ఆర్గనైజర్ల లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలి. ఇలా అన్‌లైన్‌లో అప్లోడ్ చేయడమే ప్రస్తుతం సమస్యలను తెచ్చిపెడుతోంది. మెప్మా విభాగం పరిధిలో తగినన్ని కంప్యూటర్ల లేని కారణంగా ఆన్‌లైన్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఇప్పటికీ ఆన్‌లైన్ ప్రక్రియ కేవలం 10 శాతం మాత్రమే పూర్తి అయినట్లు తెలుస్తోంది. డిసెంబర్ ఆఖరులోపు ఆన్‌లైన్ అప్లోడ్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. కమ్యూనిటీ ఆర్గనైజర్లు వారి లాగిన్‌లో సభ్యులకు ప్రొఫైల్ వివరాలను అప్లోడ్ చేసిన తర్వాత వాటిని సిటీ మిషన్ మేనేజర్ లాగిన్ నుంచే మరోసారి రాండమ్ చెకప్ కింద 25 శాతం అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. మళ్లీ ఈ వివరాలను మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలోని టెక్నికల్ అసిస్టెంట్లు తనిఖీ చేసి మరోసారి అప్లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ అంతటినీ మానిటరింగ్ చేసే మెప్మా పీడీ వీటిలో పది శాతం తనిఖీ చేయాల్సి ఉంటుంది. సుదీర్ఘ ప్రక్రియ కలిగిన ఎస్‌హెచ్‌జి సభ్యుల వివరాలు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకు అవసరమైన కంప్యూటర్ల కొరతను తీర్చాల్సిన బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్‌పై ఉంది. నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేయాల్సిన ఎస్ఐజి ప్రొఫైలింగ్ అప్లోడింగ్ ప్రక్రియకు అవసరమైన కంప్యూటర్లు లేకపోవడంతో మెప్మాలో సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేస్తున్నా ఈ ప్రక్రియ ముందుకు సాగని పరిస్థితి ఉంది.

కంప్యూటర్లు లేక అవస్థలు పడుతున్న సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్‌లో రెండేళ్లకు పైగా డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లకు కంప్యూటర్లు లేకుండానే విధులు నిర్వహించారు. గతంలో కంప్యూటర్ల కోసం నాలుగు సార్లు టెండర్లు పిలిచి వాటిని వివిధ కారణాలతో రద్దు చేశారు. ఇటీవల ఇంజినీరింగ్ అధికారుల బదిలీ ప్రక్రియలు ముగిసి ఈ విభాగంలో కొత్తవారు బాధ్యతలు స్వీకరించారు. వీరొచ్చిన తర్వాత కంప్యూటర్లను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం తెచ్చిన కంప్యూటర్లు, ఇతర పరికరాలు సైతం నాశిరకంగా ఉన్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. కంప్యూటర్లు, ప్రింటర్లు చూడడానికి బాగానే ఉన్నా పని చేయడంలో వేగం లేదంటూ ఉద్యోగులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. నిత్యం ప్రజలకు సేవలందించాల్సిన కార్పొరేషన్ కార్యాలయంలోని పలు విభాగాల్లో నెలకొన్న కంప్యూటర్లు, సాంకేతిక సమస్యల పరిష్కారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా

ఐదుగురికి గాయాలు

బోల్తా పడిన ఆటో

ప్రజాశక్తి-పుట్లూరు, యల్లనూరు

పది రోజుల క్రితం కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడి 8 మంది మరణించిన ఘటన మరువకముందే మరొకటి చోటు చేసుకుంది. యల్లనూరు మండలంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పుట్లూరు మండల పరిధిలోని గోపురాజుపల్లి గ్రామానికి చెందిన కూలీలు కూలి పనుల నిమిత్తం ఆటోలో యల్లనూరు మండలం నిట్టూరు గ్రామానికి బుధవారం ఉదయం బయల్దేరారు. కూలీలతో వెళ్తున్న ఆటో యల్లనూరు మండలం గిర్రమ్మ బావి సమీపం వద్దకు రాగానే ఓ ద్విచక్ర వాహనానికి సైడు ఇవ్వబోతూ రోడ్డు పక్కన ఉనన గోతిలో పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు గోపాల్, శ్రీనివాసులు, పెద్దిరాజు, గంగాధర, పెద్దిరాజులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన కూలీలకు ఎలాంటి ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు.

పోలీసుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర నాయకులు రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితను బుధవారం అమరావతిలో కలిశారు. పోలీసులు ఎదర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఎల్ఎస్, ఎస్ఎల్ఎస్, టిఎ, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, మెడికల్ బిల్లులు తదితర సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హోంమంత్రి అనితతో మాట్లాడుతున్న రాష్ట్ర పోలీసు సంఘం నాయకులు

విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద బైటాయించి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, మల్లుస్వరాజ్యం కాలనీవాసులు

విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోండి : సిపిఎం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నిరుపేద ప్రజలు నివసిస్తున్న మల్లుస్వరాజ్యం కాలనీలో అక్రమంగా విద్యుత్ సరాఫరా నిలిపేసిన విద్యుత్ శాఖ ఏఇ ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర నాయకులు వలి, ప్రకాష్, మసూద్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో మల్లుస్వరాజ్యం కాలనీ ప్రజలు, సిపిఎం నాయకులు విద్యుత్ శాఖ డి- కార్యాలయాన్ని ముట్టడించారు. తక్షణమే విద్యుత్ సరఫరా అందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ప్రకాష్, వలి మాట్లాడుతూ రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలోని మల్లుస్వరాజ్యం కాలనీలో పేద ప్రజలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. ఇలాంటి కాలనీకి విద్యుత్ సరఫరా నిలిపేసి పేదలను ఇబ్బందులపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ ప్రసాద్ పైస్థాయి అధికారుల ఆదేశాలతో విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు చెబుతున్నారని, ఎస్ఇ, తహశీల్దార్‌లను అడిగితే తాము ఎలాంటి ఆదేశాలూ జారీ చేయలేదని చెబుతున్నారని తెలిపారు. ఏఈ కావాలనే ప్రజలను ఇబ్బందులు పెట్టేందుకు ప్రలోభాలకు లోనై విద్యుత్‌ను నిలిపేశారన్నారు. ఇలాంటి అధికారిని సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే కాలనీలో విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబా తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల రిజిస్ట్రేషన్ నెంబర్లు, రికార్డులు, బిల్‌బుక్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 30 తేదీ లోపు దుకాణాలను రెనువల్ చేసుకోవాలని తెలిపారు.

కేరళపై కేంద్రం కక్ష

- సమైక్య పాలనాస్ఫూర్తికి విఘాతం కలిగించేలా కేంద్రం నిర్ణయాలు
- ప్రజల హక్కులకు భంగం కలిగించే చర్యలు మానుకోవాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేరళ రాష్ట్ర ప్రజల హక్కులకు భంగం కలిగించేలా కేంద్రంలోని పాలకవర్గం వ్యవహరించడం సమైక్య స్ఫూర్తికి విఘాతాన్ని సృష్టించడమే అవుతుందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ విమర్శించారు. కేరళ రాష్ట్ర ప్రజల హక్కుల పరిరక్షణకు మద్దతుగా సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని జెవివి జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలరంగయ్య అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో గేయానంద్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కేరళ రాష్ట్రం అక్షరాస్యతలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు కనీస వేతనం రోజుకి రూ.720, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేస్తున్న రాష్ట్రం కేరళ అన్నారు. వలస కార్మికులను అతిథి కార్మికులుగా గుర్తించి అన్ని వసతులూ సమకూర్చారని తెలిపారు. వరి ధన్యానికి సి2+50 మద్దతు ధర ప్రకారం క్వింటా రూ.2800 కనీస మద్దతు ధర అమలు చేసిన రాష్ట్రం దేశంలో కేరళ ఒక్కటే అన్నారు. 13 రకాల వస్తువులను చౌక ధరలకు ప్రభుత్వ దుకాణాల ద్వారా అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ సొంత గృహం కల్పించిందన్నారు. 30 రకాల వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు. వ్యవసాయ కూలీలకు పెన్షన్ సౌకర్యం చెల్లించే ఏకైక రాష్ట్రం కేరళ అన్నారు. ఇలాంటి సమయంలో ప్రజా పాలనను ప్రోత్సహించాల్సిన కేంద్ర ప్రభుత్వం బలహీనపరిచేందుకు ఆ రాష్ట్రానికి రావాల్సిన వాటా నిధులను ఇవ్వకుండా అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. కేరళ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవరహించడం సరికాదన్నారు. చట్ట పరంగా ఇవ్వాల్సిన నిధులు లక్షల కోట్లకు పైగా కేరళ రాష్ట్రం వాటా ఇవ్వలేదన్నారు. ఆర్థిక సంస్థల నుంచి అప్పు తీసుకోవడానికీ అనుమతించడం లేదన్నారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను తొక్కి పెడుతోందని తెలిపారు. గవర్నర్‌ను అడ్డుపెట్టుకుని రాష్ట్రం హక్కులకు విఘాతం కలిగించడం అన్యాయం అన్నారు. త్రివేంద్రం విమానాశ్రయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తామన్నా ఇవ్వకుండా అదానికి అప్పగించిందన్నారు. భారత్ పెట్రోలియం వంటి భారీ పరిశ్రమలను విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నించడం దుర్మార్గం అన్నారు. వయనాడ్ కొండచరియలు విరిగిపడి 400కి పైగా ప్రాణాలు కోల్పోయినా అక్కడి ప్రజలకు కేంద్రం ఎటువంటి సహాయం అందించకపోవడం విచారకరం అన్నారు. కేరళ రాష్ట్రంలో బలమైన సహకార వ్యవస్థను నాశనం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేరళ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని దేశ ప్రజలందరూ ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి, ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటనారాయణ, మర్తుజా, శ్రీనివాసులు, జిల్లా నాయకులు కె.నాగభూషణ, ఎటిఎం.నాగరాజు, నాయకులు ఎర్రిస్వామి, తిరుమలేసు, నారాయణ, లక్ష్మినారాయణ, శివారెడ్డి, కొండన్న, అశ్విని, లక్ష్మినరసమ్మ, అక్కులప్ప, ఎర్రినాగప్ప, కరీం, నారాయణరెడ్డి తదితరులు హాజరై కేరళ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని తీవ్రంగా ఖండించారు.

ఐసీడీఎస్ పీడీగా వనజా అక్కమ్మ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న వనజా అక్కమ్మ

ప్రజాశక్తి -అనంతపురం

జిల్లా మహిళా శిశుసంక్షేమ అభివద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వనజా అక్కమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కంబదురు సిడిపిఒగా పనిచేస్తున్న వనజా అక్కమ్మకు ఏపీడీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆమెనే ఇన్‌ఛార్జి పీడీగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పీడీ ప్రజాశక్తితో మాట్లాడుతూ వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలుకు కృషి చేస్తామన్నారు. అంగన్వాడీ సెంటర్లకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎత్తుకు తగ్గ బరువులేని పిల్లలను నార్మల్ గ్రేడ్‌కు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కిశోర వికాసం ప్రోగ్రామ్ పటిష్టంగా అమలు చేస్తామన్నారు. బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మను కలెక్టరేట్లో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

కలెక్టర్ల సదస్సులో డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వెలగపూడి ఏపీ సచివాలయం కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించిన 2వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో అనంతపురం జిల్లా కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొని జిల్లా అభివృద్ధిపై చర్చించారు.

కలెక్టర్ల కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

పప్పుశనగకు తెగుళ్లు

వాడుతున్న పంట - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-యల్లనూరు

ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటకు తెగుళ్లు సోకాయి. కళ్లేదుటే పంట ఎండుదశకు చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వర్షాలు సంవృద్ధిగా కురవడంతో మండల రైతులు పప్పు శనగను సాగు చేశారు. ఈ సంతోషం వారికి ఎక్కువ రోజులు నిలవలేదు. ప్రస్తుతం పప్పుశనగ మొక్కలకు తెగుళ్లు సోకాయి. వాతావరణంలో వస్తున్న మార్పులతో మొక్క కాండం నల్లగా మారుతోంది. దీంతో పచ్చగా ఉన్న మొక్కలు ఎండిపోతున్నట్లు కన్పిస్తున్నాయి. పంటకు సోకిన తెగుళ్లను వ్యవసాయ అధికారులు పరిశీలించి వాటి నివారణకు మందులు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

తెగుళ్లు సోకిన పప్పువనగ మొక్కలు

మొక్క నల్లగా మారుతోంది..

10 ఎకరాలు కౌలుకు తీసుకుని పప్పుశనగ పంట సాగు చేశాను. గత తుపాన్‌కు ముందు పైరు బాగానే ఉంది. వర్షం తగ్గాక క్రిమిసంహారక మందులు పిచికారీ చేశాను. గత మూడు రోజుల నుంచి మొక్కల కాండ కింద నలుపు తిరిగి ఎండుతోంది. 10 ఎకరాల సాగుకు ఇప్పటికే రూ.2లక్షలు పెట్టుబడి పెట్టాను. ఇలాంటి సమయంలో పంట ఎండిపోతే పూర్తిగా నష్టపోతాను. ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు స్పందించి పంటను కాపాడేలా చర్యలు తీసుకోవాలి.

అశ్వర్థ రెడ్డి, రైతు, యల్లనూరు గ్రామం.

భూ అక్రమాలను వెలికితీసి, అర్హులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-ఆత్మకూరు

భూ అక్రమాలను వెలికితీయాలని, అర్హులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత రెవె న్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని ముట్టాల గ్రామ సచివాలయ ప్రాంగణంలో బుధ వారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యేతో పాటు ఆర్డీవో కేశవనాయుడు, అధికారులు పాల్గొన్నారు. ఇందులో గొరిదిండ్ల, గొరిదిండ్లతండా, ముట్టాల, పాపంపల్లి, వేపచెర్ల, వేపచెర్ల ఎగువ తండా, దిగువతండా మొత్తం 4 పంచాయతీల పరిధిలోని 7 గ్రామాల ప్రజలు 125కి పైగా అర్జీలు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగి అక్రమంగా జారీ చేసిన భూ పట్టాదారు పాసు పుస్తకాలను ఏరి వేసి అర్హులకు న్యాయం చేయాలన్నారు. గొరిదిండ్ల రెవెన్యూ గ్రామంలో భూ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. భూ రికార్డులు మార్చిన వారు ఎంతటి వారైనా, ఏ రాజకీయ పార్టీ నాయకులైనా ఉపేక్షించవద్దన్నారు. రెవెన్యూ గ్రామంలో ఉన్న భూమి కన్నా పట్టాలు ఎలా ఎక్కువ వస్తాయని అధికారులను ప్రశ్నించారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో భూ అక్రమాలు ఎక్కువగా జరిగాయని, అందుకే భూ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ప్రతి అర్జీని అధికారులు కచ్చితంగా పరిష్కరించాలి లేదా ఆ సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయారో సమాధానం ఇవ్వాలన్నారు. పేరూరు ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో తొలగించిన రేషన్ కార్డులు, పింఛన్లను త్వరలోనే పునరుద్ధరిస్తామన్నారు. ఎన్టీఆర్ గృహాల కోసం ప్రభుత్వ భూమి ఉంటే సేకరించారని, లేనిచో రైతుల నుంచి సేకరించాలన్నారు. ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లు కూడా నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. సదస్సులో తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపిడిఒ లక్ష్మీనరసింహస్వామి, మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, సీనియర నాయకులు అనిల్‌చౌదరి, గంతి లింగన్న, శశాంక్ చౌదరి, కందుల ఓబుళపతి, బొమ్మయ్య, సూర్యనారాయణ, ఆనంద్, రామదాసు, గుజ్జుల రవి, ఓబులేసు, వెంకటేశు, ఎగ్గిడి నాగేంద్ర, గుజ్జుల వెంకటేష్, మారెక్క, పద్మావతి, పెద్ద లక్ష్మీదేవమ్మ, పోతన్న, చికెన్ వలి, మల్లయ్య, రెవెన్యూ, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పరిటాల సునీత

రెవెన్యూ సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఎస్‌కెయులో ఫీజుల వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు ఫీజుల వేధింపులు ఆపాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్‌కెయు రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎస్‌కెయు అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, శివారెడ్డిలు మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులకు పరీక్షలు దగ్గరపడుతున్న సమయాన్ని అవకాశంగా తీసుకున్న విసి, రిజిస్ట్రార్‌లు విద్యార్థుల నుంచి ఫీజు బకాయిలు వసూలు చేసే ప్రక్రియను ప్రారంభించారన్నారు. ప్రభుత్వాలు చెల్లించాల్సిన ప్రోత్సాహకాలు, డబ్బులు బకాయి పెడితే మొత్తం ఫీజు డబ్బులు విద్యార్థులే చెల్లించాలంటూ వేధించడం అన్యాయంగా ఉందన్నారు. ఎస్‌కెయులో విద్యార్థుల అడ్మిషన్‌లు తగ్గుముఖం పడుతున్న క్రమంలో వర్శిటీ అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడం మరింత ఆందోళనలకు కారణమవుతుందన్నారు. వర్శిటీలో ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయని తెలిపారు. హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ రెండేళ్లుగా బకాయి ఉన్నా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వాలు చేసే తప్పిదాలకు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడం అధికార యంత్రాంగానికి తగదన్నారు. ఫీజులతో సంబంధం లేకుండా విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలన్నారు. విసి, రిజిస్ట్రార్ల నియంత ధోరణిని మానుకోవాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి భీమేష్, వీరు, ఎస్‌కెయు నాయకులు మోహన్, చంద్రనాయక్, గణేష్, హరీష్, విష్ణు, ఎర్రిస్వామి, రాముడు, వెంకటేష్, బండేష్ పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

రిజిస్ట్రార్ ఛాంబర్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

13న 'అన్నదాతకు అండగా వైసిపి' ర్యాలీ

ప్రజాశక్తి -అనంతపురం

రైతుల సమస్యలపై ఈ నెల 13వ తేదీ నగరంలో తలపెట్టిన 'అన్నదాతకు అండగా వైసిపి' ర్యాలీని జయప్రదం చేయాలని జిల్లా టాస్క్ ఫోర్స్ సభ్యులు, బిసి విభాగం జోనల్ ఇన్‌ఛార్జి బిసి.రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులను విస్మరించడంతో వైసిపి అధినేత జగన్ రైతన్న పక్షాన పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. ఎన్నికల హామీలు, పెట్టుబడి సాయం రూ. 20వేలు, వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం, మద్దతు ధర, తదితర సమస్యలపై ఈ నెల 13వ తేదీ అనంతపురంలో జడ్పీ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహం నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు. ర్యాలీలో రైతులు, వైసిపి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోనాల రఫీ, లబ్బే రాఘవ, రామ్మోహన్‌గౌడ్, హనుమంతరెడ్డి, హిదయతుల్లా, బెస్త వెంకటేష్, నరేంద్ర, రమణ, రాఘవ, భాస్కర్, చంద్రాయుడు, తేజ, దూదూ, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రైతుల సమస్యలపై ఈ నెల 13వ తేదీ అనంతపురంలో తలపెట్టిన 'అన్నదాతకు అండగా వైసిపి' ర్యాలీని జయప్రదం చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి నివాసంలో పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, గౌని ఉపేంద్రా రెడ్డి, కౌన్సిలర్లు లావణ్య, శారద, శ్రీలక్ష్మి, గోవిందరాజులు, కోఆప్షన్ సభ్యులు నజీర్, నాయకులు పొరాలు శివ, బషీర్, నిజాముద్దీన్, బిటిపి గోవిందు, భోజరాజ్ నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : రైతులను విస్మరించిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దామని వైసిపి ఎంపిపి నరసిం హులు, పార్టీ రాష్ట్ర నాయకులు రాకెట్ల అశోక్‌కుమార్, బసవరాజు, లత్తవరం గోవిందు, జోగి వెంకటేష్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఈ నెల 13వ తేదీ అనంతపురంలో జరిగే 'అన్నదాతకు అండగా వైసిపి ర్యాలీ' పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మూలగిరిపల్లి ఓబన్న, ఈడిగ ప్రసాద్, బళ్లారి ఆసిఫ్, వడ్డే ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

'జిందాల్'పై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని హరేసముద్రం రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న జిందాల్ ఫ్యాక్టరీపై గురువారం 'ప్రజాభిప్రాయ సేకరణ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ మునివేలు తెలిపారు. ఆయన బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం 11 గంటలకు జిందాల్ ఫ్యాక్టరీ సమీపంలో ఏర్పాటు చేసే కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్, కళ్యాణ దుర్గం ఆర్డీవో హాజరవుతారని, రైతులు వారి సమస్యలను తెలుపవచ్చన్నారు.

రెవెన్యూ గ్రామసభలో ఐదు అర్జీలు

మండలంలోని ఉంతకల్లు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 5 అర్జీలు అందినట్లు తహశీల్దార్ మునివేలు తెలిపారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. సదస్సులో సర్పంచి ముక్కన్న, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వో కుళ్లాయిస్వామి, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

జెసిపిఆర్‌ను కలిసిన డిజెటి హైకా కంపెనీ సిఇఒ

ప్రజాశక్తి-తాడిపత్రి

ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ప్రసిద్ధి గాంచిన డిజెటి హైకా కంపెనీ సిఇఒ సంజయ్‌కుమార్ బుధవారం మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డితో పట్టణంలోని జెసి నివాసంలో భేటీ అయ్యారు. వారు ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి ఎపితో పాటు తాడిపత్రిలో ఛార్జింగ్ సెంటర్ల ఏర్పాటుపై చర్చించారు. ఇందుకు జెసి సుముఖత వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాల వల్ల పర్యావరణ పరిరక్షణ, ఛార్జింగ్ సెంటర్లతో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం జెసి కంపెనీ బ్రౌచర్‌ను ఆవిష్కరించారు. వారితో పాటు హరి, కృష్ణంరాజు ఉన్నారు.

ఆశా వర్కర్ ఆత్మహత్యాయత్నానికి కారకులను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆశా వర్కర్ శర్మాస్‌బీ ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎంఎల్‌హెచ్‌పి సులోచనను వెంటనే సస్పెండ్ చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి డిమాండ్ చేశారు. నాగమణి బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న శర్మాస్‌బిని పరామర్శించారు. అనంతరం ఆశా వర్కర్లు, కౌలు రైతు సంఘం, రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి ఆసుపత్రి ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. నాగమణి మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పి సులోచన వేధింపులకు గురి చేయడంతోనే శర్మాస్‌బి ఆత్మహత్యకు ప్రయత్నించిందన్నారు. తక్షణమే జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించకుండా నిర్దిష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఐ జనార్దన్ నాయుడు, వైద్యాధికారికి వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, నందు, రైతు సంఘం నాయకులు జ్ఞానమూర్తి, శ్రీనివాసులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో శర్మాస్‌బిని పరామర్శిస్తున్న నాగమణి, తదితరులు

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం : తహశీల్దార్

ప్రజాశక్తి-శింగనమల

గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య తెలిపారు. మండలంలోని శోధనపల్లి గ్రామంలో బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్పెషల్ ఆఫీసర్ నజీర్ అస్లాంబాషా హాజరయ్యారు. స్పెషల్ ఆఫీసర్, తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు వన్-బి, అడంగల్, పెండింగ్ భూములు, రీసర్వేలో సమస్యలపై రెవెన్యూ సదస్సులో అర్జీ ఇస్తే వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు, పక్కా ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజలు, రైతులకు ఎలాంటి సమస్య ఉన్నా అర్జీ ఇస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సదస్సులో 6 దరఖాస్తులు అందాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. సదస్సులో మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్, ఈ సర్వే డిప్యూటీ తహశీల్దార్ పునీత్‌బాబు, బిఎల్ శ్రీధర్‌రావు, కార్యదర్శి సెబీనాబేగం, ఎండోమెంట్ అధికారి గుర్రప్ప, నరసింహులు, నాగేంద్ర, వెంకటమ్మ, నవీన్‌కుమార్, టిడిపి నాయకులు అట్టే రామాంజనేయులు, ఎ. ఆదినారాయణ, అట్టే శంకర్, జాను గొండ శ్రీనివాసులు, చిన్నచౌడప్ప, నవీన్‌నాయుడు, తిరుపతయ్య నాయుడు, లక్ష్మయ్య, ఏకిల లక్ష్మయ్య, విఆర్ఎలు బయన్న, వీరనారాయణ, పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న తహశీల్దార్ బ్రహ్మయ్య, అధికారులు

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

అర్హులైన కౌలు రైతులందరికీ షరతులు లేకుండా బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, జిల్లా నాయకులు ముష్టూరు వెంకటేశులు కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహారావుకు కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ జిల్లాలో 8,500 మందికి పైగా సిసిఆర్‌సి కార్డులు ఉన్నప్పటికీ వారికి బ్యాంకు రుణాలు అందడం లేదన్నారు. సిసిఆర్‌సి కార్డు ఉన్న ప్రతి రైతుకీ క్రాప్ లోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు ప్రసాద్,రేణుమాకులపల్లి.సురేష్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో 450 మంది కౌలు రైతులు ఉన్నారని, వారికి ప్రభుత్వం కౌలురైతు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. అలాగే బ్యాంకర్లు ఎలాంటి షరతులు లేకుండా కౌలురైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు.

లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహారావుకు వినతి ఇస్తున్న రంగారెడ్డి, తదితరులు

ప్రభుత్వ పాఠశాలల్లో కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే కార్మికులకు తక్షణమే బకాయి వేతనాలు ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కార్మికులతో కలిసి పట్టణంలోని ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. మల్లికార్జున మాట్లాడుతూ స్కావెంజర్స్ కార్మికులకు చాలీచాలనీ వేతనాలు ఇస్తున్నారని, అవి కూడా 9 నెలల నుంచి అందక కుటుంబ పోషణ భారమైందన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, కార్మికులపై హెచ్ఎంలు, ఎస్ఎంసిల వేధింపులను అరికట్టాలన్నారు. లేనిచో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎంఇఒ నాగమణిని మాట్లాడుతూ బడ్జెట్ విడుదలైందని ఈ నెల 20వ తేదీ లోపు కార్మికుల ఖాతాల్లో బకాయి వేతనాలు జమ చేస్తామని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. వీరి ధర్నాకు ఎస్ఎఫ్ఐ నాయకులు బంగి శివ మద్దతు తెలిపారు. ధర్నాలో స్కావెంజర్స్ ఆశ, సుజాతమ్మ, అంజనమ్మ, రోజా, అనసూయమ్మ, అఖిల, నూర్జహాన్, రబియా, వన్నూరమ్మ పాల్గొన్నారు.

ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

అంగన్వాడీ సెంటర్ల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-తాడిపత్రిరూరల్

రూరల్ మండల పరిధిలోని రమేష్‌రెడ్డి కాలనీ, గోపాల్‌రెడ్డి కాలనీ, ఆర్‌డిటి కాలనీల్లో అంగన్వాడీ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఐసిడిఎస్ కోఆర్డినేటర్ విపిసి పల్లవి, , ఎంపిడిఒలకు ఎఐటియుసి ఆధ్వర్యంలో వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ ఆ మూడు కాలనీల్లో ఎక్కువగా బీడీ కార్మికులు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వారి పిల్లలకు సరైన విద్య, పౌష్టికాహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆయా కాలనీల్లో అంగన్వాడీ సెంటర్లను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ప్రశంసాపత్రాలతో కరాటే విద్యార్థులు

కరాటేలో 'భాష్యం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంతకల్లు

ఎపి కరాటే అసోసియేషన్, ఎపి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పట్టణంలోని భాష్యం స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపల్ భార్గవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 3 బంగారు, 4 వెండి, 6 కాంస్య పతకాలు సాధించినట్లు ఆమె తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను భాష్యం ఛైర్మన్ రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంతరావు, రాయలసీమ జోన్ సిఇఒ అనిల్, జెడ్ఇఒ రవివర్మ అభినందించారు. కార్యక్రమంలో పిఇటిలు భార్గవి, సురేష్, కరాటే మాస్టర్ చరణ్ పాల్గొన్నారు.

మెగా సప్లిమెంటరీ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో 2016 నుంచి 2019 మధ్య డిగ్రీ చదివిన విద్యార్థుల విన్నపం మేరకు మెగా సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు షెడ్యూల్‌ను బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ పి.పద్మశ్రీ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ హాల్ టికెట్ నెంబర్ 17, 18, 19 సిరీస్‌తో మొదలైన విద్యార్థులందరూ అర్హులే అన్నారు. వివరాలకు కళాశాల పరీక్షల విభాగంలో సంప్రదించాలన్నారు.

ప్రత్యేక ఉపకారాగారం తనిఖీ

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ప్రత్యేక ఉప కారాగారాన్ని బుధవారం న్యాయ సేవా సమితి జిల్లా కార్యదర్శి జి.శివప్రసాద్, మండల అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీహరి సందర్శించారు. వారు జైలు రికార్డులు, వంటగది, స్టోర్ రూమ్, బ్యారెక్‌లు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమై సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. వారితో పాటు న్యాయవాదులు ఎ.సూర్యనారాయణ, కోర్టు సిబ్బంది ఎస్.సాధిక్‌వలి, నరసింహనాయుడు ఉన్నారు.

ఉప కారాగారంలో స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న జడ్జి

చెరువులకు నీరిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు, కోమటికుంట్ల, గరుచింతలపల్లి చెరువులకు నీరిచ్చే విషయంలో కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. మండలంలోని చింతకుంట వద్ద జరుగుతున్న హెచ్ఎల్‌సి కాలువ గండి పూడ్చివేత పనులను బుధవారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. కల్వర్టు మరమ్మతులను వేగవంతంగా నాణ్యతగా చేయించి కాలువ ద్వారా యథావిధిగా పుట్లూరు చెరువుకు నీరందించాలని ఆదేశించారు. రైతులు ఆందోళన చెందవద్దని రెండు రోజుల్లో పనులను పూర్తి చేసి వెంటనే నీరు విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట రైతులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె.చిన్నారెడ్డి, బాలరంగయ్య, శ్రీనివాసులునాయుడు, పవన్‌కుమార్‌రెడ్డి, బ్రహ్మయ్య, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శనగలగూడూరులో రెవెన్యూ సదస్సు

మండలంలోని శనగలగూడూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొని మాట్లాడారు. వైసిపి పాలనలో పేదల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, వైసిపి భూదాహానికి ఎందరో పేదలు బలయ్యారన్నారు. భూ అక్రమాలను వెలికి తీసి ప్రజలకు న్యాయం చేసేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. భూ సమస్య ఉన్న ప్రతి రైతూ అర్జీ ఇవ్వాలని, భూ అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవన్నారు. అర్జీల పట్ల జవాబుదారీగా పని చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండి పూడ్చివేత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

మరుగుదొడ్ల నిర్వహణలో ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మరుగుదొడ్డి ఏర్పాటు చేసుకోవడంతో పాటు నిర్వహణ, ఉత్తమంగా వినియోగించుకోవడంతో మండలంలోని కన్నేపల్లి గ్రామానికి చెందిన చాకలి అంజనమ్మ, భైరవానితిప్ప గ్రామానికి చెందిన విజయలక్ష్మి జిల్లాలోనే ఉత్తమ అవార్డు దక్కించుకున్నారు. వారికి బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ సుబ్బరాయుడు, ఎంపీడీవో నందకిషోర్ అవార్డు అందజేశారు. వారు మాట్లాడుతూ నవంబర్ 18 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకూ 'వరల్డ్ టాయిలెట్ దినోత్సవం' లో భాగంగా జిల్లాలో ముగ్గురిని ఎంపిక చేయగా మండలానికి చెందిన వీరిద్దరు అవార్డు సొంతం చేసుకోవడం అరుదైన ఘటన అన్నారు. వీరికి త్వరలో మండల స్పెషల్ ఆఫీసర్ సలీంబాషా చేత ప్రశంసాపత్రం అందజేసి సన్మానిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు నాగరాజు, తిప్పేస్వామి పాల్గొన్నారు.

అవార్డులు అందజేస్తున్న ఎంపీడీవో నందకిషోర్

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-అనంతపురం

విజిలెన్స్, రెవెన్యూ అధికారులు బుధవారం బత్తలపల్లి సమీపంలోని ధర్మవరం రోడ్డులో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు చేపట్టి 45 కిలోల రేషన్ బియ్యాన్ని, వాటిని తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. రేషన్ బియ్యాన్ని ఓ వాహనంలో కర్నాటకలోని బంగారుపేటకు అక్రమంగా తరలిస్తుండగా బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి బత్తలపల్లి సిఎస్ డిటికి అప్పజెప్పామన్నారు. అలాగే బియ్యం విక్రేత దుద్దుకుంట జయపాల్‌రెడ్డి(లెనిన్‌నగర్, అనంత పురం), కొనుగోలు చేసిన దివాకర్‌నాయుడు(పూలంపల్లి, తాడిమర్రి), వాహనం డ్రైవర్ మన్నేపూల శ్రీకాంత్(మైనారిటీ కాలనీ, రాప్తాడు)లపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో సిఐ శ్రీనివాసులు, డిసిటిఒ సురేష్ కుమార్, సిఎస్‌డిటి మన్నే షణ్ముఖ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..!

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో నీలాస్వామి

- టిడిపి ఇచ్చిన గుర్తింపు ఎప్పటికీ మరువలేను
- ఎమ్మెల్యే అమిలినేని ప్రోత్సాహంతో ముందుకు...
- తెలుగుదేశం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ నీలాస్వామి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

కళ్యాణదుర్గం నియోజకవర్గం, బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లి గ్రామపంచాయతీకి చెందిన నీలాస్వామిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించింది. అతి సాధారణ కుటుంబంలో జన్మించిన ఈయనకు ఈ పదవి రావడంపై టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తనను గుర్తించి పదవి ఇవ్వడంపై నీలస్వామి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లో ఉన్నాని చెబుతున్న నీలాస్వామి ప్రజాశక్తితో పలు విషయాలను పంచుకున్నారు.

కుటుంబం.. చదువు..

గుండిగానిపల్లి గ్రామానికి చెందిన భీమప్ప, ఎల్లక్క దంపతులకు నీలాస్వామి 1988వ సంవత్సరంలో జన్మించాడు. పేద కుటుంబంలో జన్మించినా కష్టపడి ఇంజినీరింగ్ వరకు విద్యాభ్యాసం చేశాడు. విద్యాభ్యాసం మొత్తం ఆయన ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే పూర్తి చేశాడు. అనంతపురం బిసి స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకుని ర్యాంకు సాధించాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఏకైక మైనింగ్ కళాశాల కాకతీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ కొత్తగూడెం కళాశాలలో సీటును సంపాదించి అక్కడ ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేశాడు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన వెంటనే బెంగళూరులో మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం పొందాడు.

రాజకీయ ప్రస్థానం..

2014లో జరిగిన సర్పంచి ఎన్నికల్లో నీలస్వామి అమ్మ ఎల్లక్కను వార్డు మెంబర్‌గా పోటీ చేసి గెలిపించుకున్నారు. ఆ ఎన్నికల్లో సర్పంచి గెలుపునకు కృషి చేశారు. అక్కడి నుంచి పూర్తి స్థాయిలో ప్రజాసేవకు అంకితం అవ్వాలన్న ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలబండ్ల శ్రీరాములు సహకారంతో 2019 నుంచి 2024 వరకు గుండిగానిపల్లి గ్రామపంచాయతీ తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారు. తక్కువ సమయంలోనే కళ్యాణదుర్గం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడిగా ఎన్నిక అయ్యారు. 2024లో టిడిపి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే టికెట్టును అమిలినేని సురేంద్రబాబుకు ఇవ్వడంతో పూర్తిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి నీలాస్వామి అడుగుపెట్టారు. బెంగుళూరులో పని చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి అమిలినేని గెలుపునకు హితోదికంగా పని చేశారు. ప్రతిపక్ష పార్టీలపై ఘాటైన విమర్శలు చేస్తూనే టిడిపి అభివృద్ధికి కృషి చేస్తూ ముందుకు నడిచారు. ఈయన సేవలను గుర్తించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సైతం ఆయనకు సముచిత స్థానం ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి నీలాస్వామికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం



ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చాను. అందులోనూ టిడిపిలో ఉంటే మరింత ప్రజలకు దగ్గరగా ఉండొచ్చు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నాను. తనకు రాజకీయంగా గుర్తింపును ఇచ్చి, అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, రాజగోపాల్, ధర్మతేజ, యశ్వంత్, గోపి, నవీన్, అవినాష్, రాహుల్, బ్రహ్మసముద్రం టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, కురుగౌడకు రుణపడి ఉంటాను. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పయనం సాగిస్తాను.

నీలాస్వామి,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్.

మండల అభివృద్ధిపై శిక్షణ

పామిడిలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ తేజోష్ణ

ప్రజాశక్తి-నార్పల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ గంగావతి ఆధ్వర్యంలో సుస్థిర మండల అభివృద్ధి, లక్ష్యాలపై మండలంలోని అన్ని శాఖల అధికారులు, వీఆర్వోలు, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో ప్రజలకు అవసరమైన మౌలిక అవసరాలు, భవిష్యత్తు అవసరాలు, ఉపాధి, తదితర వాటిపై ఈఓఆర్‌డి రాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్ధన్, సిహెచ్ఒ బాలాజీరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ మృణాలిని, వెలుగు తిప్పమ్మ అధికారులు, పాలకులకు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 16, 17 తేదీల్లో అన్ని సచివాలయాల సిబ్బందికి మరొకసారి శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం ప్రపంచ మరుగుదొడ్ల వారోత్సవాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల ఆవశ్యకత-వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. సర్పంచులు మన్నీల సుప్రియ, రమణ కుమారిలకు అధికారులు శాలువాలు కప్పి సన్మానించారు.

పుట్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలమ్మ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్‌డి జిలాన్‌బాషా, సిహెచ్ఒ గంగరాజు, ఎపిఎం వెంకట్రామిరెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుందుర్పి : పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఎపిఎం సర్దానప్ప తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేయాలని, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

పామిడి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ తేజోష్ణ ఆధ్వర్యంలో సర్పంచులు, పంచా యతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మౌలిక వసతులు, ఉపాధి కల్పన, తదితర అంశాలపై అధికారులు, పాలకులకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఈవోఆర్‌డి కృష్ణకుమార్, అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పంచాయతీలు సుస్థిర అభివృద్ధిని సాధించినప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమని ఎంపీడీవో నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ పథకం కింద సర్పంచులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో తాగునీరు, స్త్రీ శిశు సంక్షేమం, ఉపాధి, వెలుగు, ఆరోగ్య, తదితర అంశాలకు ప్రధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు, ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటలక్ష్మి, ఎటిఎం ఐలీల్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల నభివృద్ధిపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యాదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. శిక్షణకు 21 మంది సర్పంచులు హాజరుకావాల్సి ఉండగా కేవలం నలుగురు మారతమే వచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మనోహర్ బాబు, సర్పంచులు శారద, ప్రభాకర్ రెడ్డి, నారాయణ స్వామి, ఓబుళమ్మ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పనిముట్లు అందజేత

పారిశుధ్య కార్మికులకు పనిముట్లు అందజేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప పారిశుధ్య కార్మికులకు పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లావణ్య, శారద, శ్రీలక్ష్మీ, గోవిందరాజులు, వార్డు ఇన్‌ఛార్జులు పొరాలు శివ, బషీర్, కో ఆప్షన్ సభ్యులు నజీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, సెక్రటరీ, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-పామిడి

మండలంలో పెద్ద కాలువలైన పామిడి, ఎద్దులపల్లి సాగునీటి సంఘాలకు, మైనర్ ఇరిగేషన్ చెరువులు, రామగిరి, పాళ్యం, అనుం పల్లి గ్రామాల్లోని చెరువులకు ఈ నెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి తెలిపారు. ఎద్దులపల్లి, పామిడి పెద్ద కాలువలకు 12 మంది చొప్పున, మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఆరుగురు చొప్పున ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు ఉంటారు. వీరి ఎన్నిక తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు వీరందరూ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారన్నారు. పామిడికి సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎద్దులపల్లిలో జడ్పీ హైస్కూల్, రామగిరి, పాళ్యం, అనుంపల్లి గ్రామాలకు సంబంధించి ఆయా గ్రామాల్లోని ఎంపిపి పాఠశాలల్లో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు.

ఉరవకొండ : విడపనకల్లు మండలంలోని పొలికి గ్రామంలో నీటి వినియోగదా రుల సంఘం ఎన్నికలకు సంబంధించి బుధవారం ఎలక్షన్ అధికారి, మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక ఎంపిపి స్కూల్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. నోటిఫికేషన్ వివరాలు ఎంపీడీఓ, తహశీల్దార్ కార్యాలయాలతో పాటు పొలికి సచివాలయంలో జారీ చేసినట్లు తెలిపారు.

'రాజ్యాంగ పరిరక్షణ సదస్సు' పోస్టర్ విడుదల

రాయదుర్గం : ఈ నెల 15వ తేదీ కడపలో జరిగే 'రాజ్యాంగ పరిరక్షణ, జాతీయ ఐక్యత సదస్సు' పోస్టర్లను బుధవారం పట్టణంలోని జామియా మసీదులో విడుదల చేశారు. పులివెందుల నుంచి వచ్చిన ముఫ్తి కలీముల్లా స్థానిక మౌల్వీలతో మసీదులో సమావేశమై సదస్సు ఉద్దేశ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఈమామ్ ముఫ్తి నూర్ మొహమ్మద్ జుబేర్, ఉస్మాన్, మహబూబ్‌బాషా, మహమ్మద్ రఫీక్, ఖలీల్, అహ్మద్ పాల్గొన్నారు.

నాగేంద్రకు డీఎస్పీ పరామర్శ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత నాగేంద్రను బుధవారం డీఎస్పీ రవిబాబు పరామర్శించారు. అలాగే దాడికి గల కారణాలను తెలుసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దాడికి కారణాలను వారి కుటుంబ సభ్యులందరినీ అడిగి తెలుసుకున్నారు. వారి వెంట జెఎసి నాయకులు చలమప్ప, బ్రాహ్మణపల్లి దొనతిమ్మ, నాగేంద్ర కుటుంబ సభ్యులు ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

పామిడి : విద్యార్థుల మనసులో మనోధైర్యాన్ని నింపాలని టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ తెలిపారు. ఆయన బుధవారం మండలంలోని పాల్యం గ్రామంలో పర్యటించారు. మరో రెండు రోజుల్లో గుమ్మనూరు ఈశ్వర్ జన్మదినం పురస్కరించుకొని బోయ శేఖర్ సహకారంతో 30 మంది పిల్లలకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎన్‌డిఎ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన

బుక్కరాయసముద్రం : మండలంలోని సిద్దారంపురం గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి సొంతఖర్చుతో నిర్మించిన గుడిలో బుధవారం విశాలాక్షి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టాపన చేశారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీపై నేడు సమీక్ష

బుక్కరాయసముద్రం : మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ కొనసాగుతోంది. ఎస్‌ఆర్‌పి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నారు. తనిఖీ బృందం సభ్యులు హాజరుకవాలని ఎస్‌ఆర్‌పి తెలిపారు.

టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అనంతపురం అర్బన్ నియోజవర్గంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. నగరంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో నిర్లక్ష్యం వద్దన్నారు. ప్రతి వార్డు, బూత్‌లో సభ్యత్వ నమోదులు వేగవంతం చేసి అత్యధిక సభ్యత్వాలు చేయించాలని సూచించారు. భవిష్యత్తులో పార్టీ, నామినేటెడ్ పదవులు పార్టీ సభ్యత్వ నమోదుపై ఆధారపడి కేటాయిస్తారని తెలిపారు.

వెంకటేశులు మృతి తీరని లోటు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఏళ్లుగా దళిత ఉద్యమాలకు ఊపిరి పోసిన ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రాయంపల్లి వెంకటేసులు మృతి తీరని లోటు అని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. మండలంలోని రాయంపల్లి గ్రామంలో జన్మించిన వెంకటేసులు చిన్నతనం నుంచే దళితుల్లో సామాజిక చైతన్యం తీసుకురావడానికి కృషి చేశారని తెలిపారు. ఆర్డీటీ సంస్థలో 15 ఏళ్ల పాటు గ్రామంలో కమ్యూనిటీ బేస్డ్ టీచర్‌గా పని చేసి ఎంతోమంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేశాడన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుడిగా దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలు, అత్యాచారాలు, దాడులపై గళం విప్పి పోరాడారన్నారు. ఆయన మృతదేహానికి టిడిపి, ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు.

ల్యాబ్ పరిశీలన

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని రాయలచెరువు పిహెచ్‌సిని బుధవారం తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సందర్శించి రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ల్యాబ్‌లో కచ్చితంగా మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్ మేల్‌లు గ్రామాల్లో పర్యటించి రక్తపూతలు సేకరించి ఏ రోజుకారోజు పరీక్షించాలని తెలిపారు. పాజిటివ్ వస్తే పరీక్షల కోసం తాడిపత్రి ఏరియా హాస్పిటల్‌లోని ల్యాబ్‌కు పంపాలన్నారు. ఆయన వెంట ల్యాబ్ టెక్నీషియన్ సాయిలత, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

పంట నమోదు, పంట బీమా చేసుకోవాలి

ప్రజాశక్తి-నార్పల

రబీ సీజన్‌లో పంట సాగు చేసిన రైతులందరూ కచ్చితంగా సంబంధిత రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంట సాగు చేసిన ప్రతి రైతు సంబంధిత మీసేవా సెంటర్‌లో పంట బీమా నమోదు చేసుకోవాలన్నారు. వేరుశనగ, కంది పంటలో పురుగు నివారణకు మందులను సూచించారు. కార్యక్రమంలో ఏవో సి.చన్నవీరస్వామి, ఎఇఒ రాము, గ్రామ వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు చేసుకోవడంతో పాటు ఈ నెల 15వ తేదీ లోపు బీమా ప్రీమియం చెల్లించాలని ఎడిఎ లక్ష్మానాయక్ సూచించారు. రాయదుర్గం పరిధిలోని పైతోట రైతు సేవా కేంద్రంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఎడిఎ మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులు వాతావరణ ఆధారిత బీమా, ప్రధాన మంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. వేరుశనగ, వరి, కంది పంటలకు ఆశించే చీడపీడల నివారణ చర్యలను తెలిపారు. కార్యక్రమంలో ఏవో మహేంద్ర, ఎఇఒ, ఆర్‌ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-ఉరవకొండ

సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌ఒ మాలోల, తహశీల్దార్ మహబూబ్‌బాషా తెలిపారు. మండలం లోని షేక్షానుపల్లి గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. డిఆర్ఒ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలతో పాటు గ్రామంలో ఏ సమస్య ఉన్నా అర్జీ ఇస్తే అధికారులు పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ భోగన్నగౌడ్, ఆర్‌ఐ రామకృష్ణ, మండల సర్వేయర్ రత్నాకర్, గ్రామ సర్వేయర్ వినోద్, విఆర్‌ఒలు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : మండలంలోని బ్రాహ్మణపల్లి, పి.ఎర్రగుడి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. బ్రాహ్మణపల్లిలో తహశీల్దార్ డి.ఓబులేసు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీలత అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సాయి, వీఆర్వోలు వెంకటరాముడు, టి.సురేంద్ర, కిషోర్, టిడిపి నాయకులు నగరూరు రాజశేఖర్, రంగస్వామి, రంగారెడ్డి, ఆనంద్, కొండయ్య, విఆర్ఎలు సుధాకర్ పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని సింగవరం గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహశీల్దార్ రాజు సదస్సుల ఆవశ్యకతను తెలిపారు. భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తెలియజేశారు. ఈ సదస్సులో పట్టాదారు పాసు పుస్తకం కోసం ఒక అర్జీని అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీరామప్రసాద్, ఆర్‌ఐ నారాయణమ్మ, మంజుల వాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడి హేయం

ఎస్పీ కార్యాలయం వద్ద పాత్రికేయుల నిరసన

నటుడు మోహన్‌బాబును అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

న్యూస్ కవరేజ్‌కు వెళ్లిన పాత్రికేయులపై సినీ నటుడు మోహన్‌బాబు దాడి చేయడం అత్యంత హేయమైన చర్యని పాత్రికేయుల సంఘాల నేతలు, పాత్రికేయులు తెలిపారు. మోహన్‌బాబును అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పాత్రికేయ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పాత్రికేయ సంఘాల నేతలు రామాంజినేయులు, ప్రవీణ్‌లు మాట్లాడుతూ సినీ నటుడు మోహన్‌బాబు పాత్రికేయులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కుటుంబ సమస్యను బజారుకీడ్చుకున్నందుకు పాత్రికేయులు దానిని చిత్రీకరించేందుకు వెళ్లారన్న విషయాన్ని మోహన్‌బాబు గుర్తించుకోవాలన్నారు. పాత్రికేయులను గాయపరచడం ఎలాంటి సంస్కృతి అని ప్రశ్నించారు. తక్షణమే తెలంగాణ ప్రభుత్వం స్పందించి మోహన్‌బాబును అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. దాడిలో గాయపడ్డ పాత్రికేయుని వైద్య ఖర్చులతో పాటు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.